నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

జోగులాంబ గద్వాల

సోమవారం 16 అక్టోబర్ 2023 | MONDAY, OCTOBER 16, 2023 | JOGULAMBA GADWAL | పేజీలు PAGES : 12




మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ నేతల సంబురాలు

# మ్యానిఫెస్టో.. సూపర్‌హిట్టో

- బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రణాళిక ప్రకటించిన సీఎం కేసీఆర్
- సంక్షేమం, పేదలకు అధిక ప్రాధాన్యం
- రేషన్ కార్డు ఉన్న వారికి 'అన్నపూర్ణ'
- 'కేసీఆర్ బీమా.. ప్రతి కుటుంబానికి ధీమా'తో భరోసా
- పేదలు, జర్నలిస్టులకు రూ.400కే సిలిండర్
- గణనీయంగా ఆసరా పింఛన్, రైతుబంధు సాయం పెంపుదల

బీఆర్‌ఎస్ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ ఆదివారం ఎన్నికల మ్యానిఫెస్టో ప్రకటించారు. అందులో సంక్షేమానికి, పేదల కు అధిక ప్రాధాన్యతనిచ్చారు. రోజువారీ జనావసరాల్లో భాగమయ్యేలా రూపొందించిన మ్యానిఫెస్టోతో ప్రతిపక్షాలకు మైండ్‌బ్లాంక్ అయ్యింది. ప్రజలు, దివ్యాంగులకు ఆర్థిక భరోసా కల్పించే ఆసరా పింఛన్‌ను గణనీయంగా పెంచడం విశేషం. రేషన్ కార్డు లబ్ధిదారులందరికీ సన్నబియ్యం అందించేందుకు 'అన్నపూర్ణ'ను ప్రవేశపెట్టారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని, ఏ పార్టీ ప్రవేశపెట్టని విధంగా ప్రజలందరికీ లబ్ధి చేకూరేలా ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. 'కేసీఆర్ బీమా.. ప్రతి కుటుంబానికి ధీమా'తో రాష్ట్ర వ్యాప్తంగా 93 లక్షల కుటుంబాలకు లబ్ధి కలుగనున్నది. ఈ పథకం కింద కుటుంబంలో ప్రతిఒక్కరికీ రూ.5లక్షల బీమా సదుపాయం కల్పించింది. రైతుబంధు సాయాన్ని అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది రూ.12 వేలకు చేయనున్నది. వచ్చే ఐదేండ్లనాటికి రూ.16వేలకు చేరనున్నది. పేదలు, జర్నలిస్టులకు రూ.400కే సిలిండర్ అందించాలని నిర్ణయించింది. అయితే, ఈ మ్యానిఫెస్టో సూపర్‌హిట్టు అని విశ్లేషకులు, ప్రజలు అభిప్రాయపడుతున్నారు. బీఆర్‌ఎస్‌కు ఇక తిరుగులేదని ముక్తకంఠంతో చెబుతున్నారు.

*- నాగర్‌కర్నూల్/వనపర్తి, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ)*


లోపలి పేజీల్లో..


## రైతుల కష్టాలు ఎరిగినోడు..



దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతుబంధు పథకాన్ని ప్రవేశ పెట్టిన ఘనత కేసీఆర్‌ది. రైతుల కష్టనష్టాలు ఎరిగిన ముఖ్యమంత్రి కేసీఆర్ మాకు పెట్టుబడి సాయాన్ని రూ.12వేలకు పెంచి దశల వారీగా రూ.16వేలకు పెంచుతామని ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించడం ఆనందంగా ఉంది. గతంలో ఏ ప్రభుత్వం కూడా రైతుల కష్టాలు పట్టించుకోలేదు. రైతుబంధు, రైతుబీమా, ఎరువులు, 24గంటల ఉచిత కరెంట్ ఇస్తున్నాడు. అన్నదాతకు ఇంతకంటే ఏం కావాలి. గత ప్రభుత్వాల హయాంలో పంట తడుపుకోవడానికి నానా అవస్థలు పడేటోళ్లం. ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని కరెంటుతో ఇబ్బందులుండేవి. కేసీఆర్ సీఎం అయ్యాక 24గంటల కరెంటు ఇస్తుండడంతో అవసరమైనపప్పుడు పంటకు నీళ్లు పెట్టుకుంటున్నం. అన్నదాతకు మేలు చేసే ఇలాంటి ప్రభుత్వం ఉండడం మా అదృష్టం..

*- వెంకట్రాముడు, రైతు, మానవపాడు*

# గులాబీ గుబాళింపు

- సిట్టింగులకే బీఫారాలు అందజేసిన సీఎం కేసీఆర్
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 11 మందికి పంపిణీ

- ఆయా నియోజక వర్గాల్లో కార్యకర్తల సంబురాలు
- 'కారు' జోరును ఢీకొనలేక ప్రతిపక్షాల బెంబేలు
- కాంగ్రెస్‌లో తారాస్థాయికి చేరిన టికెట్ల లొల్లి
- అభ్యర్థులు లేక ఢీలా పడిన బీజేపీ
- గులాబీ గూటికి చేరేందుకు కాంగ్రెస్, బీజేపీ నేతల క్యూ
- అలంపూర్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీతో చర్చలు

*బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు గెలుపుగుర్రాలకు ఆదివారం ప్రగతిభవన్‌లో బీ ఫారాలు అందజేశారు. అలంపూర్ అభ్యర్థికి మినహా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 11 మందికి బీ ఫారాలు పంపిణీ చేశారు. సిట్టింగులకే పట్టం కట్టడంతో పార్టీ శ్రేణులు, అభిమానుల్లో సంబురం నెలకొన్నది. గ్రామాలు, మండలాలు, నియోజకవర్గ కేంద్రాల్లో పటాకులు కాల్చి, స్వీట్లు తినిపించుకున్నారు. 'గులాబీ' గుబాళించేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఎన్నికల షెడ్యూల్డ్ వచ్చే వరకే అభ్యర్థులంతా ఆయా నియోజకవర్గాల్లో విస్తృత పర్యటనలు చేశారు. శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో సందడి చేశారు. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఖరారు చేసిన స్థానాల్లో టికెట్ల లొల్లి తారాస్థాయికి చేరుతున్నది. ఎక్కడికక్కడ అసంతృప్తులు వెల్లువెత్తుతుండడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఇక 'కమలం' చాటున పోటీ చేసేందుకు అభ్యర్థులు కరువయ్యారు. ఇప్పటివరకు చడీచప్పుడు లేకపోవడంతో క్యాడర్‌లో అయోమయం నెలకొన్నది. 'కారు' జోరును తట్టుకోలేక ప్రతిపక్షాలు బెంబేలెత్తుతున్నాయి. గులాబీ తీర్థం పుచ్చుకునేందుకు గ్రామాల్లో విపక్షాల నాయకులు క్యూ కడుతుండడంతో వారిని నిలువరించలేక నానా తంటాలు పడుతున్నారు. కారు టాప్ గేర్ అందుకోవడంతో ముచ్చెమటలు పడుతున్నాయి.*

*- మహబూబ్‌నగర్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*



సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బీఫారం అందుకుంటున్న మంత్రి నిరంజన్‌రెడ్డి





బీఫారం అందుకుంటున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి





బీఫారం అందుకుంటున్న ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి




వివరాలు IV లో..